దళిత రక్షణ యాత్రను జయప్రదం చేయండి

వ్యకాస జిల్లా అధ్యక్షులు జార్జి

ప్రజాశక్తి - యలమంచిలి

ఈ నెల 21వ తేదీ నుంచి జరిగే దళిత రక్షణ యాత్రను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి పిలుపు నిచ్చారు. శనివారం చించినాడ పెదపేటలో వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో సంతకాలు సేకరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జార్జి మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకూ జరిగే రాష్ట్ర జాతాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు యడ్ల మోహనరావు, మాసవరపు సుబ్బారావు, కెవిపిఎస్ మండల కార్యదర్శి కానేటి బాలరాజు, మండల నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, దిద్దే ఎసేపు పాల్గొన్నారు.

రాజకీయం రసవత్తరం..!

- టిడిపి, జనసేన పొత్తు ప్రకటనతో హాట్‌టాపిక్‌గా జిల్లా రాజకీయం
- సీట్ల కేటాయింపుపై టిడిపితో వైసిపి మైండ్‌గేమ్
- టిడిపి, జనసేన కేడర్‌లోనూ సీట్ల పంపకాలపై తర్జనభర్జనలు
- భీమవరంలో పవన్‌కల్యాణ్ పోటీ, మెజార్టీపైనా ఇప్పటి నుంచే చర్చలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల పొత్తులపై జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన ప్రకటనతో జిల్లా రాజకీయం మరింత రసవత్తరంగా మారింది. పొత్తుపై టిడిపి, జనసేన కేడర్‌లో సుముఖత వ్యక్తమవుతున్నప్పటికీ సీట్ల కేటాయింపుపై మాత్రం తీవ్ర చర్చ సాగుతోంది. దీన్ని ఆసరాగా చేసుకుని టిడిపిని టార్గెట్ చేస్తూ వైసిపి మైండ్‌గేమ్ ప్రారంభించిందనే చర్చ నడుస్తోంది. ఫలానా నియోజకవర్గంలో సదరు నాయకుడికి టిక్కెట్ పోయినట్లే అంటూ సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతూ మైండ్‌గేమ్ ఆడుతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. గత ఎన్నికల సమయంలో సదరు నాయకులకు వ్యతిరేకంగా పత్రికల్లో వచ్చిన వార్తల క్లిప్పింగులను సేకరించి తాజా వార్తలుగా ప్రచారం చేస్తుండటం ఇరుపార్టీల్లో చర్చనీయాంశంగా మారింది. టిడిపి, జనసేన కేడర్‌లో చీలిక తెచ్చేందుకు వైసిపి ప్రయత్నిస్తుందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. వైసిపి మైండ్ గేమ్‌కు ప్రధాన కారణం ఒక్కటేననే చర్చ నడుస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జనసేన గతంకంటే బలం పుంజుకుంది. కాపు సామాజిక తరగతి ఎక్కువగా ఉండటంతో జనసేన పలు నియోజకవర్గాల్లో ప్రభావం చూపే పరిస్థితి ఉంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు ఉన్నాయి. పొత్తులో భాగంగా జనసేనకు ఐదు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానం తీసుకునే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. నరసాపురం ఎంపీ స్థానంలో జనసేన అభ్యర్థి పోటీకి దిగే అవకాశం ఉందని లెక్కలు కడుతున్నారు. ఇక అసెంబ్లీ సీట్లకు వచ్చేసరికి నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, ఏలూరు స్థానాలను అడిగే అవకాశం ఉందని చెబుతున్నారు. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం సీట్లలో టిడిపికి ఇబ్బంది లేకపోయినప్పటికీ ఉంగుటూరు, ఏలూరు స్థానాల విషయంలో కొంత ఇబ్బంది వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఎందుకంటే ఉంగుటూరు నియోజకవర్గంలో మాజీ ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు ఉన్నారు. ఆయన ప్రస్తుతం టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులుగా ఉన్నారు. దీంతో ఉంగుటూరు సీటు జనసేనకు ఇచ్చేసినట్లేనని, గన్నికి సీటు లేదంటూ వైసిపి ఇప్పటి నుంచే మైండ్‌గేమ్ ఆడుతుందనే చర్చ నడుస్తోంది. ఏలూరు స్థానం రెడ్డి అప్పలనాయుడుకా.. బడేటి చంటికా అంటూ సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్న పరిస్థితి నెలకొంది. సీట్ల కేటాయింపు అనేది అధినాయకుల నిర్ణయాలను బట్టి ఉంటుందని టిడిపి, జనసేన నాయకులు చెబుతున్నారు. అయితే ఇప్పటి నుంచే వైసిపి సీట్ల కేటాయింపుపై మైండ్‌గేమ్ ప్రారంభించి టిడిపి, జనసేన కేడర్‌ను గందరగోళపరుస్తోందని ఇరుపార్టీల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో జనసేన బలం టిడిపికి తోడైతే అత్యధిక స్థానాలను గెలుచుకునే అవకాశం ఉందనే ప్రచారం నేపథ్యంలో వైసిపి ఇలాంటి మైండ్‌గేమ్ ప్రారంభించిందని టిడిపి, జనసేన నాయకులు చెబుతున్నారు.

పవన్‌కల్యాణ్ పోటీ, మెజార్టీపైనా చర్చ

టిడిపి, జనసేన పొత్తు ఖరారు కావడంతో భీమవరంలో పవన్‌కల్యాణ్ పోటీపై తీవ్రమైన చర్చ సాగుతోంది. గతంలో టిడిపి, జనసేన విడివిడిగా పోటీచేయడం కారణంగానే పవన్‌కల్యాణ్ ఓడిపోయారని, ఈసారి అటువంటి పరిస్థితి ఉండదని లెక్కలు వేస్తున్నారు. పవన్‌కల్యాణ్ భీమవరం నుంచి పోటీచేయడం ఖాయమన్నట్లు పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. అదే తరుణంలో గత ఎన్నికల్లో ఏయే పార్టీలకు ఎన్ని ఓట్లు వచ్చాయనే లెక్కలు తీస్తూ పవన్‌కల్యాణ్‌కు ఎంత మెజార్టీ వచ్చే అవకాశం ఉందనే అంశంపై బెట్టింగ్‌లు సాగుతున్నాయి. పవన్‌కల్యాణ్ జిల్లాలో పోటీ చేస్తేనే ప్రయోజనం ఉంటుందని అంచనాలు వేస్తున్నారు. దీంతో రెండు జిల్లాల్లోనూ రాజకీయం వేడెక్కింది. ఇప్పుడే ఎన్నికలు వచ్చేస్తున్నాయా అన్నట్లు జిల్లాలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి.

లబ్ధిదారులకు మాన్యువల్ చెక్కును అందజేస్తున్న జెసి రామ్ సుందర్‌రెడ్డి

వైఎస్ఆర్ కాపునేస్తం ద్వారా రూ.51.96 కోట్ల లబ్ధి

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

నాలుగో ఏడాది వైఎస్ఆర్ కాపునేస్తం కార్యక్రమం ద్వారా జిల్లాలో 34,642 మంది మహిళా లబ్ధిదారులకు రూ.51.96 కోట్ల మేర లబ్ధి జరుగుతోందని జిల్లా జాయింటు కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి తెలిపారు. శనివారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిడదవోలు బహిరంగ సభలో నాలుగో విడత వైఎస్ఆర్ కాపునేస్తంను కాపు, తెలగ, బలిజ, ఒంటరి మహిళలకు రాష్ట్రంలో 3,57,844 లక్షల మందికి రూ.536 కోట్ల 77 లక్షలు బటన్ నొక్కి జమ చేసే కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జెసి ఎస్.రామ్ సుందర్‌రెడ్డి, ఎంబిసి ఛైర్మన్ పెండ్ర వీరన్న, సంబంధిత అధికారులు, కాపు మహిళలు తిలకించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ 45 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న అర్హులైన వారికి ఒక్కరికీ సంవత్సరానికి రూ.15 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. పథకాల లబ్ధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హత ఉండి ఏ కారణంచేతనైనా లబ్ధి జమ అవ్వకపోతే గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించి దరఖాస్తు చేసుకుంటే వెరిఫికేషన్ చేసి లబ్ధి అందజేయనున్నట్లు తెలిపారు. నాలుగో ఏడాది 2023-24కి గాను 34,642 మందికి రూ.51.96 కోట్లు నియోజక వర్గాలు వారీగా ఇలా జమచేశారు. ఆచంట నియోజక వర్గంలో 3,276 మందికి రూ.491.40 లక్షలు, భీమవరం నియోజకవర్గంలో 4,693 మందికి రూ.703.95 లక్షలు, నరసాపురం నియోజకవర్గంలో 6,062 మందికి రూ.909.30 లక్షలు, పాలకొల్లు నియోజకవర్గంలో 3,944 మందికి రూ.591.60 లక్షలు, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 5,264 మందికి రూ.789.60 లక్షలు, తణుకు నియోజకవర్గంలో 5,729 మందికి రూ.859.35 లక్షలు, ఉండి నియోజకవర్గంలో 4,092 మందికి రూ.613.80 లక్షలు, గణపవరం మండలంలో 1,582 మందికి రూ.237.30 లక్షలు మొత్తం జిల్లాలో 34,642 మందికి రూ.51.96 కోట్లు జమ అయ్యాయి. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, బిసి కార్పొరేషన్ ఎఇఒ ప్రమీలారాణి, నాయీ బ్రాహ్మణ, కార్పొరేషన్ డైరెక్టర్ పట్నాల గౌరీ గణపతి పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే చంద్రబాబుపై కేసులు

కొనసాగిన టిడిపి రిలే నిరాహార దీక్షలు, నిరసనలు

ఉండిలో కాగడాల ప్రదర్శన చేస్తున్న ఎంఎల్‌ఎ రామరాజు, నేతలు

ప్రజాశక్తి - ఆచంట

చంద్రబాబుపై కేవలం రాజకీయ కక్షతో అక్రమ కేసులు బనాయించడం దారుణమని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ తెలిపారు. టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 4వ రోజు శనివారం కొనసాగాయి. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, నేతలు కేతా మీరయ్య, బీరా నరసింహమూర్తి, తమ్మినీడి ప్రసాద్, గొడవర్తి శ్రీరాములు పాల్గొన్నారు.

తణుకు : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్రరావు సంఘీభావం తెలిపారు.

తాడేపల్లిగూడెం: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ భీమవరం రోడ్డులో గొర్రెల సూరన్న కాంప్లెక్స్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి నాయకత్వంలో చేపట్టిన దీక్షలకు జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్, పట్టణ అధ్యక్షులు వర్దనపల్లి కాశి, టిడిపి నేతలు గంధం సతీష్, కొండ, పసుమర్తి రామ లక్ష్మణ్ సంఘీభావం తెలిపారు.

మొగల్తూరు : ముత్యాలపల్లిలో టిడిపి నాయకులు మోకాళ్లపై కూర్చుని చెవిలో పువ్వుతో అర్ధనగ్న నిరసన ప్రదర్శన చేశారు. ముందుగా గ్రామంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కొల్లాటి బాలకృష్ణ, దొంగ శ్రీను, నాగిడి రాంబాబు, కె.మూలస్వామి, పెదసింగ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉండి : చంద్రబాబును రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము జగన్మోహన్ రెడ్డికి లేక ఆయనను అక్రమ కేసుల్లో బనాయించి జైలులో పెట్టించారని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కార్యాలయం వద్ద నాలుగో రోజు దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా వారు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం కాగడాలతో పెద్ద వంతెన వరకూ భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కరిమెరక నాగరాజు, కిన్నెర వెంకన్న, పోత్తూరి వెంకటేశ్వరరాజు, రుద్రరాజు సూర్యనారాయణ రాజు, కాగిత సత్యనారాయణ, ముదునూరి కృష్ణంరాజు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ పోస్ట్‌కార్డుల ఉద్యమాన్ని మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు చేపట్టారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ పది వేల పోస్టు కార్డులు రాష్ట్రపతి, గవర్నర్‌కు ఈ రోజు నుంచి పంపిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, కొట్టు పండు, ఎం.రాంప్రసాద్, చాగంటి రాము, మాజీ ఎంపిటిసి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెనుమంట్ర : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ మాజీ మంత్రి పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్ ఆధ్వర్యంలో జనసేన, టిడిపి నాయకులు మార్టేరు సెంటర్‌లో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి మురళి మోహన్‌రావు, చింతపల్లి రామకృష్ణ, టి.దుర్గారెడ్డి, అచ్యుత రామారెడ్డి, బులిరామిరెడ్డి పాల్గొన్నారు.

పరిశోధనా ఫలాలు క్షేత్రస్థాయికి చేరాలి

ఎపి నిట్ డీన్ శాస్త్రి

పిహెచ్‌డి విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పరిశోధనా ఫలాలు క్షేత్రస్థాయికి చేరినప్పుడే వాటికి సార్థకత లభిస్తుందని ఎపి నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ జిఆర్‌కె.శాస్త్రి తెలిపారు. ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్ రెడ్డి పర్యవేక్షణలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పిహెచ్‌డి విద్యార్థుల పేపర్ ప్రజంటేషన్ కార్యక్రమం శనివారం ముగిసింది. ఎఐ అండ్ రోబోటిక్స్ క్లబ్, ఇన్నోవేషన్ సెల్, ఇఇఇ, ఇసిఇ, సిఎస్ఇ విభాగాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శాస్త్రి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువతరానిదేనని తెలిపారు. చరిత్రలో తరతరాలుగా నిలిచిపోయే ఆవిష్కరణల రూపకల్పనకు పాటుపడాలని సూచించారు. జాబిల్లి దక్షిణ ధ్రువంపై తొలిసారి పరిశోధనా వెలుగును ప్రసరింపజేసిన ఘనత భారత శాస్త్రవేత్తలకే దక్కుతుందని, వారి స్ఫూర్తితో కొత్త కొత్త ప్రాజెక్టులను చేపట్టాలని వివరించారు. ఎఐ అండ్ రోబోటిక్స్ క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఫణికృష్ణ కర్రి మాట్లాడుతూ యువత తమలోని అపార శక్తియుక్తులను వెలికితీసి ఆధునిక కాలానికి తగిన నైపుణ్యాలను పుణికి పుచ్చుకుంటే ఉన్నత శిఖరాలను సులువుగా చేరుకోవచ్చని తెలిపారు. అనంతరం తమ పేపర్ ప్రజంటేషన్‌తో ఆకట్టుకున్న ముగ్గురు పిహెచ్‌డి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మొత్తం 34 మంది తాము చేస్తున్న పరిశోధనలు, వాటి ప్రాధాన్యతను వివరించారు. న్యాయనిర్ణేతలుగా అసోసియేట్ డీన్ డాక్టర్ పి.శంకర్, విభాగాధిపతులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ జి.కిరణ్‌కుమార్, డాక్టర్ హిమబిందు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు టి.రమేష్, కిరణ్ తీపర్తి, నగేష్ భట్టు, సుదర్శన దీప పాల్గొన్నారు.

మీ పిల్లలైతే ఇలాగే వదిలేస్తారా

సిబ్బందిని నిలదీసిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

పలు విద్యాసంస్థల్లో ఆకస్మిక తనిఖీలు

సిబ్బందితో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ పాలకొల్లులోని ఎస్‌కెపి, టివిఆర్ మున్సిపల్ హైస్కూల్, ఎంవిఎస్ ప్రయిమరీ స్కూల్, సిహెచ్ ఎన్ఆర్ఎస్ఎ మున్సిపల్ స్కూల్, ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. అలాగే మసీదు ఎదురుగా ఉన్న 6వ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అయితే విద్యా ప్రమాణాలు సరిగ్గా లేవని, టీచింగ్ సిబ్బంది బాధ్యతగా చెప్పడం లేదని, మీ పిల్లలైతే ఇలాగే ఊరుకుంటారా అని పలు స్కూళ్లల్లో సిబ్బందిని నిలదీశారు. ఎవరికి వారు పైవారు చూసుకుంటారని వదిలేయడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. కనీసం జిల్లా అధికారులు కూడా బాధ్యతగా ఉండడం లేదన్నారు. కళాశాల విద్యార్థులు కొందరు ఫీజులెందుకు కట్టడం లేదో వారి ఇంటికి వెళ్లి కొనుక్కుందామని చెప్పారు. కొంత మంది సిబ్బంది ఇంటి నుంచి తాగునీరు తెచ్చుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వం రూ.6 లక్షలు ఖర్చు చేసి ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ పెట్టిందని సిబ్బంది ఇంటి వద్ద నుంచి నీరు తెచ్చుకుంటే విద్యార్థులకు నమ్మకం ఎలా ఉంటుందని నిలదీశారు. ప్రిన్సిపల్, సిబ్బంది కళాశాల వాటర్ ప్లాంట్ నీరు తాగాలన్నారు. కళాశాలలో 280 మంది విద్యార్థులు ఉండగా 24 మంది టీచింగ్ సిబ్బంది ఎందుకని, వెంటనే వారిని ఫ్లస్ వన్‌కు బదిలీ చేయాలని కోరారు. మరలా తాను వచ్చినప్పుడు విద్యాబోధన మెరుగుకాకపోతే సస్పెండ్ అవుతారని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదులను సందర్శించి అధ్యాపకులను సిలబస్ పురోగతి, పాఠ్య ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. తరగతి గదిలో కనీసం 80 శాతం విద్యార్థుల నోట్‌బుక్స్ అధ్యాపకులు తప్పనిసరిగా పరిశీలించి తప్పులు సరిదిద్దాలని, ఈ ప్రక్రియను ప్రిన్సిపల్ నిరంతరం పర్యవేక్షించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ తప్పక పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఆర్‌వి.రమణ, ఆర్‌జెడిలు శారద, లక్ష్మీ, ఎంఇఒ గుమ్మళ్ల వీరాస్వామి, మున్సిపల్ కమిషనర్ శేషాద్రి, తహశీల్దార్ సిహెచ్ పెద్దిరాజు పాల్గొన్నారు.

బిజెపిని ఓడించడమే సిపిఎం లక్ష్యం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - ఆచంట

రానున్న ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించడమే సిపిఎం ప్రధాన లక్ష్యమని పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. ఆచంట వేమవరంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎస్‌విఎన్.శర్మ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో బలరాం పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మోడీ మరోసారి అధికారంలోకి వస్తే దేశ భవిష్యత్ ప్రమాదంలో పడుతుందన్నారు. రాష్ట్రాల ఆర్థిక వనరులను లాక్కొని, హక్కులను కాలరాస్తూ, రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్న మోడీ ప్రభుత్వం దేశ ప్రజలందరి శత్రువని, ఈ శత్రువును ఓడించడానికి దేశంలోని రాజకీయ పక్షాలు, ప్రజలంతా కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. బిజెపి అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తవుతున్నా ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలుపర్చలేదని విమర్శించారు. కార్పొరేట్, బడాబాబులకు దాదాపు రూ.12 లక్షల కోట్లు రుణమాఫీ చేసి దేశ ప్రజల సంపదను దోచిపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో కుల, మతాలు, ప్రాంతాలే కాకుండా తెగల మధ్య కూడా చిచ్చు పెట్టి చలికాచుకుంటోందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప ఉక్కు, విభజన హామీలు, రాజధాని నిర్మాణానికి నిధులు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఈ సమస్యలన్నింటిపై కలిసొచ్చే అభ్యుదయ, ప్రజాతంత్ర శక్తులను కలుపుకుని రాబోయే కాలంలో దేశంలో, రాష్ట్రంలో పేద, సామాన్య ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఎం ప్రజా ఉద్యమాలను, పోరాటాలను నిర్వహించనున్నామని, ఈ పోరాటాలన్నింటిలో ప్రజానీకం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, పోడూరు, పెనుగొండ మండలాల కార్యదర్శులు పిల్లి ప్రసాద్, సూర్నీడి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కమిటీ సభ్యులు వద్దిపర్తి అంజిబాబు, గుత్తుల రంగారావు, కుసుమే జయరాజు, మచ్చా సుబ్బారావు పాల్గొన్నారు.

నిరసనలు.. నిర్బంధాలు..!



టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుతో ఆ పార్టీ శ్రేణులు వివిధ రూపాల్లో నిరసనలు తెలపడం ప్రారంభించాయి. లోకేష్ యువగళం యాత్రలో భీమవరం శివారు తాడేరు వంతెన వద్ద వైసిపి, టిడిపి ఘర్షణతోనే జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ తర్వాత మూడు రోజులు లోకేష్ యాత్ర సాఫీగా సాగి తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశించడంతో పరిస్థితి సద్దుమణిగింది. అయితే నంద్యాలలో చంద్రబాబు అరెస్టుతో జిల్లా వ్యాప్తంగా టిడిపి శ్రేణులు రోడ్లపైకొచ్చి ఆందోళనలు ప్రారంభించారు. చంద్రబాబు కోర్టు మెట్లు ఎక్కాక కచ్చితంగా బెయిల్ వస్తుందని సంబరాలకు సిద్ధమయ్యారు. అయితే కోర్టు చంద్రబాబుకు రిమాండ్ విధించడం, హుటాహుటీన రాత్రి సమయంలోనే రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించడం గంటల వ్యవధిలో జరిగిపోయింది. దీంతో కంగుతిన్న టిడిపి నేతలు సైతం మరుసటి రోజు బంద్ నిర్వహణకు రంగంలోకి దిగలేకపోయారు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వ నిర్బంధం. బంద్ నాటి నుంచి నేటి వరకూ రెండు జిల్లాల్లో టిడిపి ఆందోళనలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గృహ నిర్బంధాలు వంటి వాటితోపాటు నేరుగా నాన్‌బెయిల్‌బుల్ కేసులు పెడతామని హెచ్చరించే స్థాయికి పోలీసులు అధికారులు వెళ్లారంటే అతిశయోక్తి కాదు. ప్రజాస్వామ్యంలో నిరసనలకే చోటులేదన్నట్లు కార్యాలయాలు, ఇళ్ల వద్దే నిరాహార దీక్షలు చేపట్టాలి తప్ప ప్రధాన కూడళ్లు, కార్యాలయాల వద్ద చేపట్టొద్దంటూ హుకుం జారీ చేశారు. దీంతో మరోసారి టిడిపి నేతలు కంగుతిన్నారు. ఇక గత్యంతరం లేక కార్యాలయాల వద్దే దీక్షలు ప్రారంభించారు. ఆపై ప్రార్థనా మందిరాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేయడం ప్రారంభించారు. సామాన్య ప్రజానీకంలో చంద్రబాబు అరెస్టు నుంచి టిడిపి నిరసనల వరకూ అన్నీ చర్చనీయాంశమయ్యాయి. అదే సమయంలో జనసేనాని పవన్ కళ్యాణ్ పొత్తు ప్రకటనతో టిడిపి శ్రేణులు తమకు ఒక అండ దొరికిందన్నట్లు ఊరట పొందాయనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. అయితే పోలీసులు శాంతియుతంగా నిర్వహిస్తున్న పాదయాత్రలను సైతం అడ్డుకోవడం చర్చనీయాంశమైంది. ఏలూరు జిల్లాలో ద్వారకాతిరుమల మండలంలో టిడిపి పాదయాత్రను పోలీసులు అడ్డుకున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. యాత్రను అడ్డుకునే ప్రయత్నం కాకుండా లాఠీలు ఝుళిపించడానికే ఉత్సాహం చూపారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇక పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు పోలీసుల వైఖరిపై ఆగ్రహంతో రగిలిపోతున్నారు. స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్న దుకాణదారులను పోలీసులు బెదిరించి షాపులు తెరిపించే ప్రయత్నం చేశారని, ఇదెక్కడి దారుణమంటూ సిఐను నిలదీశారు. పట్టణంలో యాత్రగా ముందుకెళ్తున్న ఎంఎల్‌ఎను అడ్డుకోవడం మరింత వివాదాస్పదమైంది. అధికారపక్ష వ్యతిరేకులు ఎవరైనా రోడ్డెక్కితే నిర్బంధించడమే పోలీసుల పనిగా మారిందనే విమర్శలు విన్పిస్తున్నాయి. లోకేష్ యాత్రలో తాడేరు వంతెన వద్ద ప్రదర్శించిన నిర్లిప్త వైఖరితో పోలీసు శాఖ అపఖ్యాతి మూటగట్టుకుంది. ఇదే తీరు కొనసాగితే వైసిపి, టిడిపి శ్రేణుల నడుమ వైరం టిడిపి వర్సెస్ పోలీసు శాఖ అన్నట్లుగా తయారయ్యే ప్రమాదం ఉందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

ప్రజా ఉద్యమాలపైనా అదే నిర్బంధం

అగ్రిగోల్డ్ బాధితులు తమకు ఇచ్చిన హామీలు అమలు చేసి న్యాయం చేయాలని కోరుతూ చలో విజయవాడకు పిలుపునిస్తే జిల్లాలో సంబంధిత ప్రతినిధులను గృహ నిర్బంధం చేశారు. వైసిపి ప్రభుత్వ నిర్బంధం టిడిపి ప్రభుత్వ నిర్బంధాన్ని మించిపోయిందనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. గరగపర్రు ఉద్యమం, ఆక్వా ఫుడ్ పార్క్ వ్యతిరేక ఉద్యమం, ఎర్రకాల్వ మిగులు భూములపై పోరు చేస్తున్న పేదలపై అక్రమ నిర్బంధం, ఏజెన్సీలో భూపోరాటంపై ఉక్కుపాదం, భూస్వాములకు వత్తాసు పలకడం, శ్రీనివాసపురంలో దళిత పాలేరు హత్య ఘటన సందర్భంగా ఆ గ్రామానికి ఎవరినీ వెళ్లనీయకుండా అడ్డుకోవడం వంటి ఘటనలన్నీ టిడిపి ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్నాయి. ఫలితంగానే గత ఎన్నికల్లో జిల్లా ప్రజలు టిడిపికి గట్టి షాక్ ఇచ్చారు. ఆ ఉద్యమాలు, ఆందోళనలను అడ్డు పెట్టుకుని హామీలిచ్చి అధికారంలోకొచ్చిన వైసిపి ప్రభుత్వం వాటన్నింటినీ గాలికొదిలేసి టిడిపిని మించి నిర్బంధం విధించడం కచ్చితంగా ప్రతికూల ప్రభావం చూపుతుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికార పక్షం ఇచ్చిన హామీలు అమలు చేసి చట్టబద్ధంగా వ్యవహరించడంతోపాటు పోలీసు అధికారులు సైతం చట్టానికి లోబడి ప్రభుత్వ సేవకులుగా కాక ప్రజా రక్షకులుగా ఉండాలని పలువురు మేధావులు సూచిస్తున్నారు.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

నోటిఫికేషన్ రద్దు పట్ల సిపిఎం హర్షం

ప్రజాశక్తి - భీమవరం

జాతీయ రహదారి 165 పామర్రు నుంచి దిగమర్రుకు సంబంధించి భీమవరంలో ఆప్షన్ 10 సిగా లంకపేట ఎస్‌సి కాలనీ నుంచి వీరవాసరం మండలం పెర్కిపాలెం మీదుగా హైవే నిర్మాణానికి జారీ చేసిన నోటిఫికేషన్ రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సిపిఎం పట్టణ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. భీమవరం లంకపేట ఎస్‌సి కాలనీతో పాటు పెర్కిపాలెం ప్రజలకు ఊరట కలిగిస్తుందని తెలిపారు. 2018 మే 26న సాంకేతిక బృందం భీమవరంలో పర్యటించి ఆప్షన్ 10ఎ అప్రూవల్ ఉన్న బైపాస్‌ను గ్రీన్‌ఫీల్డ్ హైవేగా చేసుకోవచ్చని నివేదిక సమర్పించిందని, వాటిని హైవే అధికారులు పట్టించుకోకుండా 10 సి నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. దీనిపై అప్పట్లో 254 మంది అభ్యంతరాలు తెలిపారని పేర్కొన్నారు. లంకపేటలో దళితుల ఇళ్లు తొలగించొద్దని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన దీక్షలు, ధర్నాలు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామని, అయినా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో 79 మంది ఇళ్లు కోల్పోతున్న బాధితులు 2018 అక్టోబర్‌లో హైకోర్టులో పిటీషన్ వేయగా ఐదేళ్లపాటు సుదీర్ఘ పోరాటం చేయగా బాధితులకు అనుకూలంగా తీర్పురావడం అభినందనీయమని తెలిపారు. సిపిఎం అండతో పేదలు తమ ఇళ్లు నిలుపుకున్నారని తెలిపారు. సిపిఎం నిరంతరం పేదలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు.

భాస్కర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్

గుండెపోటుతో మున్సిపల్ ఉద్యోగి భాస్కర్ మృతి

పుట్టినరోజునాడే మరణం

భాస్కర్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

మున్సిపల్ ఉద్యోగి యర్రప్రగడ భాస్కర్ (54) శనివారం ఉదయం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. శనివారం ఆయన పుట్టినరోజు కూడా. ఆయన ఆకస్మిక మృతిని కుటుంబసభ్యులతో పాటు తోటి ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయన తండ్రి మున్సిపల్ ఉద్యోగిగా పని చేశారు. తండ్రి బాటలో నడిచిన భాస్కర్ పురపాలక సంఘానికి విశిష్ట సేవలందించారు. ముఖ్యంగా మున్సిపల్ సమావేశాల్లో ఎజెండా చదివే తీరు ఆయనకే చెల్లింది. భాస్కర్‌కు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు ఆయన మృతదేహాన్ని సందర్శించి పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఆర్ఐ నానాజీ, గోటేటి అరుణ, కౌన్సిలర్ జయరాజు, శరత్, మున్సిపల్ ఉద్యోగులు భాస్కర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తణుకులో నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తణుకు నియోజకవర్గ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు శనివారం తణుకు ఆర్ట్స్ కాలేజీలో నిర్వహించినట్లు కో-ఆర్డినేటర్ సంకు సూర్యనారాయణ తెలిపారు. ఈ పోటీలను మానేపల్లి శ్రీనివాస్, బాయ్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.పద్మావతి ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల్లో గెలుపొందినవారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికల్లో తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తీర ప్రాంతంలో వ్యర్థ పదార్థాలు ఏరుతున్న సిబ్బంది

బీచ్ తీరప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో స్వచ్ఛ సాగర్ సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మత్స్యకార సంక్షేమ సమితి, మత్స్య నారాయణస్వామి ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా సముద్ర తీర ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ప్రజలకు, విద్యార్థులకు తీరప్రాంత పరిశుభ్రతపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి మేళం బన్ను, జాతీయ మహాసముద్ర సేవా కేంద్రం శాస్త్రవేత్తలు బుర్ర శివయ్య, సూర్యదత్త సుధాకర్, మత్స్యశాఖ జెడి ఆర్‌విఎస్‌వి.ప్రసాద్, ఎఫ్‌డిఒలు సిహెచ్.రాంబాబు, కొల్లాటి భార్గవి, అంతర్వేది మెరైన్ ఎస్ఐ పి.సోమశేఖర్‌రెడ్డి, మైలా శ్రీనివాస్ అర్జున్‌కుమార్, బొక్క శ్రీనివాస్, పొన్నమండ రాజా, రామ్మోహన్‌రావు, సంగాని శ్రీనివాస్, తిరుమని కాంతారావు పాల్గొన్నారు.

నెగ్గిపూడిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే పరిశీలన

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నెగ్గిపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఎంపిడిఒ పద్మజ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ వైద్యులు ఇంటింటికి వచ్చి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. వాలంటీర్లు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలపై సర్వే చేస్తున్న విధానాన్ని, యాప్‌ల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రెండో దశలో బిపి, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, స్ఫూటం (కఫం) పరీక్షలను సిహెచ్ఒ నిర్వహిస్తారని తెలిపారు. సమస్యలున్న వారిని ఈ నెల 30వ తేదీన నిర్వహించే తొలి హెల్త్ క్యాంపునకు తరలిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మామిడిశెట్టి ధనలక్ష్మి, ఉప సర్పంచి సాయిరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ కోరుతూ దీక్ష

ప్రజాశక్తి - ఆచంట

పార్లమెంట్ సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు కనపాల పెద్దిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. వీరికి టిడిపి, జనసేన నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు చదలవాడ సంపత్‌రావు, చదలవాడ బాబూరావు, ప్రభాకరరావు, వెంకటేశ్వరరావు, బాలాజీ, నాని పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యార్థులను పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళ్తున్న స్కూల్ బస్సుకు ప్రమాదం తప్పింది. స్కూల్ బస్సు శనివారం సాయంత్రం విద్యార్థులకు ఎక్కించుకుని వెళ్తుండగా పాలకొల్లు బైపాస్ రోడ్డు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి రోడ్డు మార్జిన్ దిగిపోయింది. ఎటువంటి ప్రమాదం సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆ సమయంలో బస్సులో 36 మంది విద్యార్థులు ఉన్నారు. అందరూ సురక్షితంగా బయటపడ్డారు.

రేషన్ బియ్యం పంపిణీ వాహనం దగ్ధం

ప్రజాశక్తి - ఉండి

షార్ట్ సర్క్యూట్‌తో రేషన్ బియ్యం పంపిణీ వాహనం దగ్ధమైన సంఘటన మండలంలోని ఆరేడు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఆరేడు గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీ చేస్తుండగా వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో బియ్యం తూచే వ్యక్తి కరణం రామకృష్ణకు గాయాలయ్యాయి. సుమారు రూ.50 వేల విలువైన ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. కరణం రామకృష్ణను భీమవరం ఆసుపత్రికి తరలించారు.

టిప్పర్ బోల్తా

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని వారతిప్పలో శనివారం టిప్పర్ పంట కాలవలో బోల్తా పడింది. భీమవరం గ్రామీణ మండలం వెంప నుంచి వారతిప్ప వైపు వెళ్తున్న ఖాళీ టిప్పర్ రహదారి అధ్వానంగా ఉండడంతో అదుపుతప్పి కాలువలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు లేకుండా చూడాలి

డిపిఒ మల్లికార్జునరావు

బిఎల్ఒలతో మాట్లాడుతున్న డిపిఒ మల్లికార్జునరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడ ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని జిల్లా పంచాయతీరాజ్ శాఖాధికారి మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని పాలకోడేరు, గరగపర్రు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. గరగపర్రు ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు అంతంత మాత్రమే ఉండడం, భవనం శిథిలావస్థకు చేరడంపై స్థానిక బిఎల్ఒలతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, లేదా మరోచోట పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో బిఎల్ఒలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రతి 1500 జనాభాకు ఒక పోలింగ్ కేంద్రం ఉండాలని, ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో 300 ఓట్లు కచ్చితంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు ఏమైనా ఉంటే చూసి అక్కడ పోలిక కేంద్రం ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్ సౌకర్యం, తాగునీరు, ఇంటర్నెట్, భవనానికి తలుపులు, కిటికీలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నూకల మురళీగంగాధరరావు, తహశీల్దార్ షేక్ హుస్సేన్, బిఎల్ఒలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సత్కారం

కాళ్ల : స్వామిమాస్టారును సత్కరిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సీసలి స్పెషల్ పాఠశాల ఉపాధ్యాయుడు బొబ్బిలి రాజమౌళి కోటేశ్వరస్వామిని విద్యా కమిటీ ఛైర్మన్ పి.రమేష్, ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల ఐదో తేదీన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో సీసలి గ్రామానికి రాజమౌళి కోటేశ్వరస్వామి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారని గ్రామస్తులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బాతు మాణిక్యం, వార్డ్ మెంబర్ చార్లెస్, కమిటీ ప్రెసిడెంట్ భూపతి రాజారత్నం, జొన్నలగడ్డ పండు, అమృతరావ్, జౌదు అబ్రహం, ఎం.నతానియేలు, భూపతి యాకోబు, కొత్తపల్లి ఏసు పాల్గొన్నారు.

పెనుమంట్ర : కాశీవిశ్వనాథంను సత్కరిస్తున్న వక్తలు

పెనుమంట్ర :జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బ్రాహ్మణ చెరువు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కొండేటి కాశీ విశ్వనాథంను పొలమూరు హైస్కూల్ కాంప్లెక్స్‌లో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎస్.తాతయ్య అధ్యక్షతన శుక్రవారం రాత్రి అభినందన సభ నిర్వహించారు. ఈ నెల ఐదో తేదీన గురుపూజోత్సవం కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదగా పురస్కారం అందుకున్నారు. అభినందన సభలో కాశీవిశ్వనాథం తండ్రి చంచయ్య మాట్లాడుతూ తన కుమారుడు జిల్లా ఉత్తమ అవార్డు, సన్మానం అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం కాశీ విశ్వనాథం, సత్యవతి (సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత) దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు డిఎన్‌వి.సత్యనారాయణ, ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు పిఎన్‌వి.ప్రసాద్‌రావు, ఎపిటిఎఫ్ నాయకుల కె.రాంబాబు, పిఆర్‌టియు నాయకులు హరిరాజా, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కెఎస్‌యు.శ్రీనివాస్, వియ్యంకుడు గనిపిరెడ్డి శ్రీనివాస్, లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఓజోన్ పొర పరిరక్షణ ప్రపంచంలో అందరి బాధ్యత అని పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ మట్లపూడి సత్యనారయణ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సర్‌సివి.రామన్ ఇంగ్లీష్ మీడియం స్కూలులో ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సూర్యుని నుంచి వెలువడే కిరణాలు నేరుగా భూమిపై పడకుండా అందులో ఉండే అతినీలలోహిత కిరణాలును ఓజోన్ పొర సంగ్రహించి, ప్రాణకోటికి వాటిల్లే ముప్పు నుంచి కాపాడుతుందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మోటారు వాహనాలు పెరగడం, పరిశ్రమల కాలుష్యం, అధిక శాతం మంది ఏసీలను వినియోగించడం వల్ల ఓజోన్ పొర క్షీణించిపోతోందన్నారు. అడవుల నరికివేతను పూర్తిగా నిలిపివేయాలని, మొక్కలను పెంచాలని ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ సిహెచ్.పార్వతి, వైస్ ప్రిన్సిపల్ పి.సరిత, ఉపాధ్యాయులు గాయత్రి, ఎన్.రాధ పాల్గొన్నారు.

వీరవాసరం :అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని వీరవాసరం, తోలేరు హైస్కూళ్లలో శనివారం ఘనంగా నిర్వహించారు. తోలేరులో నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో, వీరవాసరంలో పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తోలేరు ప్రధానోపాధ్యాయులు విఎంజెడ్.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ఓజోన్ పొరను మనం రక్షించుకోకపోతే రానున్నకాలంలో జీవుల మనుడగ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఓజోన్ భూమికి ఏ విధంగా రక్షణగా ఉంటుందో గొడుగుల ద్వారా విద్యార్థులకు వివరించారు. ఎండలో గొడుగు మనకు ఏ విధంగా రక్షణగా ఉంటుందో ఓజోన్ కూడా భూమికి ఆ విధంగా రక్షణగా ఉంటుందన్నారు. ఎంఆర్‌కె హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జె.శ్రీనివాస్ మాట్లాడుతూ మొక్కలను పెంచడం ద్వారా ఓజోన్ పొరను రక్షించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, కనకలక్ష్మి, శివకుమార్, రవికుమార్, సాయిబాబు పాల్గొన్నారు.

గణపవరం : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గణపవరం : ఓజోన్ పొరను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని లయన్స్ క్లబ్ జోన్ పర్సన్ కె.సత్యనారాయణమూర్తి అన్నారు. ఓజోన్ డే సందర్భంగా శనివారం స్థానిక కాలేజీ విద్యార్థులకు ఓజోన్ పొరపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లియో సభ్యులు రావూరి నాగరాజు, కిలారి రవిబాబు, విశారద, కాలేజీ ప్రిన్సిపల్ అడపాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెనుగొండ : ఎస్‌వికెపి డాక్టర్ కెఎస్.రాజు ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రిన్సిపల్ డాక్టర్ వైవివి.అప్పారావు మాట్లాడారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

పాలకోడేరు : వంటకాలను పరిశీలిస్తున్న సుజాతరాణి

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రతిఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని, తద్వారా మంచి ఆరోగ్యం దరిచేరుతుందని ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి అన్నారు. శృంగవృక్షం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పోషకాహార మాసోత్సవం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు తయారుచేసిన పోషకాహార పదార్థాలను పీడీ సుజాతరాణి పరిశీలించి మాట్లాడారు. నెలరోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో పోషకాహారం ఆవశ్యకతపై వివిధ రూపాల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. సర్పంచి జంగం సూరిబాబు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు. ఆకివీడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ వి.వాణి విజయరత్నం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి సారించి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సోడదాసి నరేష్, సూపర్‌వైజర్లు పార్వతి, బాలకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట :ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ కోరారు. మండలంలోని కొడమంచిలిలో రైతు కమ్యూనిటీ హాలులో కొడమంచిలి క్లస్టర్ పరిధిలోని వేమవరం, పెదమల్లం, కోడేరు, కందరవల్లి గ్రామాలకు చెందిన అంగన్‌వాడి కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు బాలామృతం, పాలు, గుడ్లు పోషకాహర పదార్థాలు అందించారు. సుంకర సీతారామ్ మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు వివిధ వంటలు తయారు చేసుకుని ప్రదర్శించడం అభినందనీయమని కొనియాడారు. వంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గోవర్ధన్, వైసిపి నేత పి.వనమారాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్యామలాంబ, అంగన్‌వాడీ కార్యకర్తలు పొలిశెట్టి దుర్గాభవాని, సల్లపూడి సుజాత, కలగట కనకదుర్గ, కోట రజిని, సల్లపూడి సుజాత, పెచ్చెట్టి శోభరాణి, వై.రాఘవమ్మ, సిహెచ్.గౌరీశ్వరి, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

గణపవరం : గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని కేశవరం సర్పంచి మిడతాని కామేశ్వరి నాగేశ్వరరావు అన్నారు. పోషకాహార మాసోత్సవాల సందర్భంగా తాడేపల్లిగూడెం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారాన్ని తీసుకుంటే తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. ఎ.గోపవరం సెక్టార్ సూపర్‌వైజర్ జి.చంద్రావతి మాట్లాడుతూ పోషకాహార మాసోత్సవాల సందర్భంగా సెక్టార్ పరిధిలోని అన్ని గ్రామాల్లో కూడా సమావేశాలు నిర్వహించి గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్ల రాజుపేట, జల్లి కాకినాడ, అప్పన్నపేట గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు ఎంఎల్‌హెచ్‌పి జె.జ్యోతి, హెల్త్ అసిస్టెంట్లు ఆదినారాయణ, ఆశావర్కర్ సుమలత పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని కాళీపట్నం గ్రామంలో ఉన్న సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో పోషకాహార మాసోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని కిశోర బాలికలకు పౌష్టికాహారంపై, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ మోజెష్, ప్రిన్సిపల్ శాంతి, అంగన్‌వాడీ టీచర్లు సారమ్మ, సరోజిని, గౌతమి, పార్వతి, జ్యోతి ప్రభ, మను పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలు.. పర్యావరణానికి ఎంతో మేలు

ప్రజాశక్తి - వీరవాసరం

పర్యావరణానికి మేలు చేసే మట్టి విగ్రహాలతో వినాయక చవితిని జరుపుకోవాలని తోలేరు ప్రధానోపాధ్యాయుడు విఎంజెడ్.శ్రాంప్రసాద్ విద్యార్థులకు సూచిం చారు. ఈ మేరకు శనివారం మట్టి విగ్రహాలను ప్రోత్సహించే విధంగా విద్యార్థులతో మట్టి విగ్రహాలను తయారు చేయిం చారు. ఈ నెల 17వ తేదీ ఆదివారం మట్టి విగ్రహాలను ఉచితంగా అందించనున్నట్లు జెడ్‌పిటిసి సభ్యులు గుండా జయప్రకాష్‌నాయుడు తెలిపారు. ఈ విగ్రహాలను యునైటెడ్ కాపు క్లబ్, కాపు వనిత ఆధ్వర్యంలో వీరవాసరం బస్టాండ్ వద్ద అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పాలకొల్లు : పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు శనివారం మట్టి వినాయక ప్రతిమల తయారీ పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులు అందించారు. కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహరావు, కార్యదర్శి కలిదిండి రామరాజు చేతులమీదుగా సర్టిఫికెట్స్, మెడల్స్ బహూకరించారు. ఈ సందర్భంగా నరసింహరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా నిబిడీకృతమై ఉన్న వివిధ కళా నైపుణ్యాన్ని, పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని తెలియజేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని, విఘ్నేశుడు ప్రతి రూపాన్ని ఏ రూపంలో తయారుచేసినా అందంగానే ఉంటుందని, విద్యార్థులు ప్రదర్శించిన వివిధ వినాయక రూపాలను చూసి విద్యార్థులను ప్రశంసించారు. రామరాజు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు సాంస్కృతిక, కళప్రావీణ్యం సంపాదించుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత, వివిధ పండుగల విశిష్టతను విద్యార్థుల్లో లౌకికత, భిన్నత్వంలో ఏకత్వం చాటి చెప్పేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు.

ఉండి : మట్టి ప్రతిమలతో శశి హైస్కూల్ విద్యార్థులు

తణుకు : వినాయక చవితిని పురస్కరించుకుని స్థానిక మాంటిస్సోరి స్కూలులో విద్యార్థులు శనివారం వినాయక ప్రతిమలను తయారుచేసి ప్రదర్శించారు. స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాష్‌రావు ప్రతిమలను పరిశీలించారు. తల్లిదండ్రులు, పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వారి సృజనాత్మకతను ప్రదర్శించారని అభినందించారు. ప్రముఖ సిద్ధాంతి వెలవలపల్లి చంద్రశేఖర్, అధ్యాపకురాలు అమృతవల్లి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. లయన్స్ క్లబ్ జిల్లా డిప్యూటీ క్యాబినెట్ సెక్రటరీ వావిలాల సరళాదేవి వెంకటరమేష్ దంపతుల ఆర్థిక సహకారంతో జిల్లాలోని అన్ని క్లబ్బులకు వినాయక ప్రతిమలను శనివారం అందించారు. ముఖ్య అతిథిగా లయన్స్ క్లబ్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, టిఎస్.పద్మావతి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉండి :ఉండి రాజులపేటలోని శ్రీ శశి హైస్కూల్‌లో విద్యార్థులు మట్టి వినాయకుని ప్రతిమలు తయారుచేశారు. స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : శశి ఇంజినీరింగ్ కళాశాల రెడ్ యాంట్స్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా గణేష్‌నగర్ ప్రజలకు కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మట్టి విగ్రహాలను శనివారం ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ హితమైన మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల వాలంటీర్లను వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ప్రిన్సిపల్ మొహ్మద్ ఇస్మాయిల్, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు అభినందించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సూచన మేరకు త్రిఫ్ ఇండస్ట్రీ వారి ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ కార్మికులకు, సిబ్బందికి మట్టి విగ్రహాలు పంపిణీ చేసినట్లు సిఎస్ఆర్ అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్(ఆపరేషన్) ఎస్.రామలిం గేశ్వరశర్మ, హెచ్ఆర్ జిఎమ్.జనార్దన్, హెచ్ఆర్ మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.లక్ష్మీసరోజ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : మండలంలోని సీతారామపురంలో స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఎఐఎంఎల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎంఎల్ హెచ్ఒడి డాక్టర్ బొమ్మ రామకృష్ణ మాట్లాడారు. కళాశాల ఛైర్మన్ కొండవీటి సత్యనారాయణ, ట్రెజరర్ కెవి.స్వామి, డైరెక్టర్ ఎ.శ్రీహరి విద్యార్థులను అభినందించారు.

పెనుగొండ : స్థానిక శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో శనివారం గణేష్ చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు మట్టి విగ్రహాలను తయారుచేసే పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.సత్యనారాయణ, ఎఐ సాయి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

ఎంపిపి చంటిరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) అన్నారు. మండలంలోని వేంద్ర అగ్రహారం గ్రామంలో తడి, పొడి చెత్త డబ్బాలను ఎంపిపి చంటిరాజు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి యజమాని ఇంట్లోని తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని చెప్పారు. ఆ చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించి చెత్త నుంచి సంపదను తయారు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కడలి విజయలక్ష్మి సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ షేక్‌హుస్సేన్, ఆర్ఐ నాగభూషణం నాయుడు, సచివాలయ కార్యదర్శి కడలి భవాని, విఆర్ఒ మల్లేశ్వరరావు, దొరబాబు, రాంబాబు, కుడిపూడి శ్రీను, దావాల శ్రీను పాల్గొన్నారు.

పెడల్ టూ ఫ్రీడం -23 సైకిల్ ర్యాలీకి ఎఎస్ఎన్ఎం విద్యార్థులు

ప్రజాశక్తి - పాలకొల్లు

కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్, రెడ్‌రోప్ సంస్థ వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న పెడల్ టూ ఫ్రీడం -23 స్టూడెంట్స్ సైకిల్ ర్యాలీకి తమ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. కళాశాల విద్యార్థులు వి.వెంకట్, ఎ.లోకేష్, డి.జ్యోష్ణప్రశాంతి, బి.నవ్య ఎంపికయ్యారన్నారు. ఈ సైకిల్ ర్యాలీ ఈ నెల 19వ తేదీన విజయవాడలో ప్రారంభమై 11 జిల్లాలో పర్యటిస్తూ పలు అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తారని తెలిపారు. 29వ తేదీన ఈ సైకిల్ ర్యాలీ నంద్యాలలో ముగుస్తుందని చెప్పారు. ర్యాలీకి ఎంపికైన విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.రామకృష్ణ, డాక్టర్ వి.విజయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ జి.మహేష్ అభినంధించారు.

ఎరువుల దుకాణాల్లో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రమైన మొగల్తూరులోని సొసైటీ గోడౌన్, ఎరువుల దుకాణాలను శనివారం వ్యవసాయ శాఖ ఎడి అనిల్‌కుమారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాలు సొసైటీ ఎరువులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సూపర్, పొటాష్ ఎరువులను విక్రయాలు నిలిపివేయాలని ఆదేశించారు. అవసరమైన వారు రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆమెతో పాటు ఎఒ అబ్దుల్ రహీం, సిబ్బంది ఉన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా ఉద్యమాలు, ప్రతిపక్ష నేతల పట్ల పోలీసుల అణిచివేత చర్యలు నిరసిస్తూ ఈ నెల 17వ తేదీ ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిం చనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి భీమారావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతల పట్ల, ప్రజా ఉద్యమాల పట్ల పోలీసుల అణిచివేత దారుణమన్నారు. ఈ చర్యలను నిరసిస్తూ ఆదివారం ఉదయం పది గంటలకు భీమవరం ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. వైసిపి, బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలను ఈ సమావేశానికి ఆహ్వానిస్తున్నాట్లు తెలిపారు.

యుపిఎ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు మండల యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ (యుపిఎ) బలోపేతానికి కృషి చేస్తామని అధ్యక్షులు డాక్టర్ గోపే సాల్మన్‌రాజు తెలిపారు. గోపే సాల్మన్ అధ్యక్షతన యుపిఎ సర్వసభ్య సమావేశం మోగల్లు గ్రామంలో జె.విజయ్‌కుమార్ నివాస ప్రాంతంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధ్యక్షులు ఎం.శ్యాంబాబు, ఎఐసిసి జిల్లా అధ్యక్షులు జెఎస్.రావు, బిజె.ప్రసాద్, టి.యాకోబు, రమేష్, అబ్రహం, యేసురత్నం, పేతురు, ఎ.ఆసాపురాజు, డానియల్ పాల్గొన్నారు.

కోర్టు ప్రకటన

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, భీమడోలు, ఏలూరు జిల్లా

I.A.No. 211/2021
in F.D.I.A.No. 552/2023
in O.S.No. 91/2021

Between:
Sri Bhimadole Bala Srinu ...*Plaintiff*
AND
Sri Pandella Krishna Bhagavan
...*Defendant /Respondent-1*

Respondent /Defendant-1:
Sri Pandella Krishna Bhagavan, S/o. Satyanarayana, Hindu, Male, Aged 49 Yrs, R/o. D.No. 16-77, Ganapathi Center, Bhimadole Village, Eluru Dist.

పై నెంబరు దావా I.A.No. 211/2021 in F.D.I.A.No. 552/2023 in O.S.No. 91/2021 గ్రంథములో డిఫెండెంటు /రెస్పాండెంటు 1 కు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించిననూ మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు (సబ్ స్టీ ట్యూట్ సర్వీస్) పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసులు అమలుకు ది.30-06-2023వ తేదీన ఆర్డరు వేసినారు. **ది.20-09-2023వ తేదీన వాయిదా. మీరు పై వాయిదా తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టులో స్వయం గా గాని, అడ్వకేట్ ద్వారా గాని కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలియపరచు కొనవలెను.** లేని ఎడల మీ పై పరోక్షమున తీర్మానించబడును.

K.M.SRINIVASA RAO (VASU)
Advocate, Bhimadole.
Cell: 99121 81862